క్లుప్తంగా

మంత్రి పొంగులేటికి ఆహ్వానం



జాతర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి: ఈ నెల 25న మండలంలోని బైరవునిపల్లిలో నూతనంగా నిర్మించిన గంగమ్మ దేవాలయ ప్రారంభోత్సవానికి రావాలని సంఘం ప్రతినిధులు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని కలిసి ఆహ్వానించారు. ఖమ్మం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రికి ఆహ్వాన పత్రిక అందించారు. అనంతరం మోటాపురంలో ఈ నెల 25 నుంచి 27 వరకు జరిగే వీరన్న స్వామి జాతర పోస్టర్లను ఆవిష్కరించారు.

రహదారులపై ధాన్యం పోయొద్దు

కూసుమంచి: రహదారులపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణం కావొద్దని పోలీసులు రైతులకు సూచించారు. శుక్రవారం రాత్రి ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారి సిబ్బంది, పోలీసులు కలిసి రైతులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రైతులు వాహనదారుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ధాన్యం ఆరబోయొద్దని, ఏమైనా ప్రమాదాలు జరిగితే బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గ్రూప్-1 ర్యాంకర్‌కు సన్మానం



వంశీని సత్కరిస్తున్న తహసీల్దార్, తదితరులు

తిరుమలాయపాలెం: ఇటీవల విడుదలైన గ్రూప్–1 ఫలితాల్లో రాష్ట్రస్థాయి 63వ ర్యాంకు సాధించిన మండలంలోని కాకరవాయికి చెందిన కొత్తపల్లి ఖషీల్‌వంశీ శుక్రవారం తహసీల్దార్ సుధీర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను తహసీల్దార్‌తో పాటు కార్యాలయ ఉద్యోగులు సన్మానించారు. కార్యాలయ ఉద్యోగులు నరసింహారావు, రేసు వీరయ్య, వసీం, రాధికతో పాటు కాంగ్రెస్ నాయకుడు ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వైట్ బోర్డు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం 37 డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి బీజేపీ నాయకులు వైట్‌బోర్డు బహూకరించారు. ఖమ్మం వన్ టౌన్ అధ్యక్షుడు గడిల నరేష్‌తో పాటు వీరవెల్లి మిత్రవింద రాజేష్‌గుప్తా, బండ్ల రీగన్, పొట్టి మూర్తి జనార్దన్, కందుల శ్రీకృష్ణ, పాలెపు రాము, పులి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సంతాపం..

ఖమ్మం లీగల్: నగరానికి చెందిన న్యాయవాది గురిజాల నాగేంద్ర అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఆయన మృతికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, కార్యదర్శి గద్దల దిలిప్‌కుమార్, కార్యవర్గం, ఐలు, ఐఏఎల్, టీడీపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ న్యాయవాద సంఘాలు ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతి తెలిపారు.

కలిసిరాని యాసంగి..

యాసంగి సాగు నష్టాల బాట
- వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతుల మొగ్గు
- మండలంలో 2,685 ఎకరాల్లో సాగు
- తెగుళ్లు, నీటి కొరతతో తగ్గిన దిగుబడి
- పశువులకు మేతగా మారుతున్న పంటలు



ఎర్రబారిన పెసర పంట

కామేపల్లి: ఈ ఏడాది యాసంగి సీజన్‌లో వ్యవసాయం దారుణంగా దెబ్బతీసింది. పంటల సాగు అంచనాలు తలికిందులై రైతులు నష్టాల మూట కట్టుకున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది కాస్త వర్షాలు బాగా కురిసి చెరువులు, కుంటలు నిండి భూగర్భ జలాలు పెరగడంతో రైతులు గతంలో మాదిరిగానే ఈ ఏడు యాసంగిలో అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు. కానీ ఈ ఏడు పంటల సాగుకు అనుకులమైనా పంట పూత, కాత దశలో వచ్చిన తెగుళ్లు, భూగర్భ జలాల తగ్గి నీటి కొరత ఏర్పడడంతో ఏ ఒక్క పంట ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయాయి. పంటలకు ఓ వైపు పూత దశలో తెగుళ్ల బెడద, మరోవైపు భూగర్భ జలాలు పూర్తిగా పడిపోవడంతో వేలాది ఎకరాల్లో సగం కూడా చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కొందరు చేసేది ఏమీ లేక పంటను పశువులకు మేతగా వదిలేస్తున్నారు.

బోరు, బావులను నమ్ముకుని..

మండలంలో బోరు, బావులపై ఆధారపడే యాసంగి పంటలను సాగు చేశారు. అయితే జనవరి చివరి నుంచి భూగర్భ జలాలు పడిపోవడంతో రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు మాత్రమే నీటిని అందించారు. దీంతో యాసంగిలో సాగు చేసిన అపరాల పంటలకు నీరు సకాలంలో అందించకపోవడం, నీరు ఉన్న పంటలకు తెగుళ్ల సోకడంతో పంట దిగుబడిపై ప్రభావం చూపింది. వరి పైరుకు పూర్తి స్థాయిలో నీటిని అందించలేకపోయారు.

2,685 ఎకరాల్లో సాగు..

మండలంలో 2,685 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. అత్యధికంగా 1,245 ఎకరాల్లో మొక్కజొన్నను సాగు చేయగా, వరి 908, పెసర 402, జొన్న 91, వేరుశనగ 25, మినుము 13 ఎకరాల్లో మాత్రమే సాగు చేపట్టారు.

అపరాలపై ఆసక్తి..

అపరాల సాగుపై ఈ ఏడాది రైతులకు ఆసక్తి పెరిగి సాగు చేశారు. కానీ పూత దశలో పంటలకు నల్లి, దోమ, పురుగు కారణంగా రైతులు ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోగా పెట్టిన పెట్టుబడులు కూడా రానీ పరిస్థితి ఏర్పడింది. మార్కెట్‌లో కూడా అపరాలకు ఆశించిన స్థాయిలో ధర లేకపోవడం రైతులపై మరింత భారం పడింది. దీంతో రైతులు యాసంగి నష్టాల బాటే పట్టారు.

పెట్టుబడులు కూడా రావు..



ఈ ఏడాది ఎకరన్నరలో పెసర, మినుము, బొబ్బెర పంటను సాగు చేశాను. పంట ఎదుగుదల ఆశాజనకంగా ఉంది కానీ పూత, కాత దశలో తెగుళ్లలతో పాటు నల్లి, దోమ విపరీతంగా పంటకు సోకి పంట దిగుబడిపై ప్రభావం చూపింది. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేట్లు లేవు. యాసంగి సాగు చేసి మరీ నష్టపోయాను.

– అనుమంచినేని లాలయ్య, రైతు, పండితాపురం

నిరంతర శ్రమతోనే ఉన్నత లక్ష్యాల సాధన

జాతీయ స్థాయి ఫెస్ట్‌లో కలెక్టర్



ఇస్రో మాజీ శాస్త్రవేత్త వెంకటనారాయణను సన్మానిస్తున్న కలెక్టర్, తదితరులు

ఖమ్మం అర్బన్: ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవడమే కాక నిరంతరం శ్రమిస్తేనే వాటిని సాధించొచ్చని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఖమ్మంలోని బొమ్మ విద్యాసంస్థల్లో శుక్రవారం నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత లక్ష్యాలను ఎంచుకుని.. ఎప్పటికప్పుడు ఎలా సాధించాలనే ప్రశ్న వేసుకుంటూ ముందుకు సాగితే ఫలితం ఉంటుందన్నారు. ఉన్నతస్థాయికి చేరడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పిస్తే సంతృప్తిగా ఉంటుందని చెప్పారు. అనంతరం ఇస్రో మాజీ శాస్త్రవేత్త డాక్టర్ గంజి వెంకటనారాయణను కలెక్టర్ సన్మానించారు. బొమ్మ విద్యాసంస్థల చైర్మన్, వైస్‌చైర్మన్లు బొమ్మ రాజేశ్వరరావు, బొమ్మ సత్య ప్రసాద్, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కిరణ్‌జ్యోతి, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ భిక్షం, ప్రొఫెసర్ రంజిత్, సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్, అధ్యాపకులు విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి గోగో ఎలక్ట్రిక్ ఆటో



బజాజ్ ఆటోను ప్రారంభిస్తున్న వీవీసీ అధినేత రాజేంద్రప్రసాద్

ఖమ్మంఅర్బన్: బజాజ్ ఆటో ఎలక్ట్రిక్ వాహనం విభాగంలో బజాజ్ గోగో ఆటోను అధీకృత డీలర్ వెంకటరమణ ఆటో మొబైల్స్ ద్వారా మార్కెట్‌లోకి శుక్రవారం విడుదల చేసినట్లు వీవీసీ గ్రూప్ సంస్థల అధినేత వీవీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. పవర్ ఫుల్ 12 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో సుమారు 250 కి.మీ.లకుపైగా మైలేజ్ ఇస్తుందని, రెండు వెరియంట్లలో ప్రారంభ ధర 3,26,797 రూపాయలుగా ఉందన్నారు. తొలి రోజు 10 ఆటోలను కస్టమర్లకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు..

తిరుమలాయపాలెం: మండలంలోని బీరోలు, తిరుమలాయపాలెం, ఏలువారిగూడెం తదితర గ్రామాల్లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. గతంలో 9 కేంద్రాలు ఏర్పాటు చేయగా ఈసారి 14 కేంద్రాలతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తహసీల్దార్ సుధీర్ తెలిపారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాలలో మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఏపీఎం చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సేదదీరుస్తోంది..



జనరల్ ఆస్పత్రి మధ్య పెరిగిన మర్రి వృక్షం

ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ భారీ మర్రి వృక్షం రోగులను తన చల్లని నీడతో సేదదీరుస్తోంది. దీనిని సుమారు 5 దశాబ్దాల క్రితం ఆస్పత్రి మధ్యభాగంలో నాటారు. ప్రస్తుతం అది పెరిగి పెద్దదై భారీ వృక్షంగా తయారైంది. దీని కొమ్మలు విస్తరించడంతో ఇన్‌పేషంట్ వార్డుల్లోని రోగులు ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. ముఖ్యంగా ఎండాకాలంలో పలు వార్డులు చల్లబడి ఉంటుండడంతో ఈ చెట్టు నీడతోనే ఇక్కడ ఉండగల్గుతున్నామని ఆస్పత్రికి వచ్చే వారు, పేషంట్లు చెబుతుండడం గమనార్హం.

– ఖమ్మంవైద్యవిభాగం

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: సంఘ సంస్కర్త, రచయిత, అణగారిన వర్గాలు సమాజంలో సమాన హక్కులు పొందేందుకు సత్యసమాజ్‌ను స్థాపించిన మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈనేపథ్యాన నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, చోటేబాబా, ఓబీసీ సెల్ అధ్యక్షుడు పి.వీరభద్రం, రషీద్, హుస్సేన్, వెంకన్న, కార్పొరేటర్లు సైదులు, శరత్, నాగేశ్వరరావు, లక్ష్మణ్, శంకర్ నాయక్, కనకరాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

● **ఖమ్మం మామిళ్లగూడెం:** నగరంలోని శ్రీశ్రీ సర్కిల్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి,



బీఎస్పీ ఆధ్వర్యాన మోటార్ సైకిల్ ర్యాలీ

ఖమ్మం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమాల్లో బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ పాల్గొని పూలేకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరి గౌరీశంకర్, సంఘ నేతలు నెహ్రూ, విజయ్‌కుమార్, వరలక్ష్మి, మాల మహానాడు నాయకుడు గుంతెటి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బహుజన్ సమాజ్ పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించి బైపాస్‌లోని పూలే విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల నాగరాజు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లెపొంగు విజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి బుర్ర ఉపేందర్, మధిర, పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల అధ్యక్షులు గంధం వంశీ, మట్టే నాగేశ్వరరావు, నల్లగట్ల సతీష్ పాల్గొన్నారు.

● **నేలకొండపల్లి:** మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యాన పూలే చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్‌తో పాటు నాయకులు కృష్ణారావు, దుర్గారావు, షేక్ షర్ఫుద్దీన్, సయ్యదు మోహినుద్దీన్, పొట్టి శ్రీరాముల సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కాసాని నాగేశ్వరరావు, జెర్రిపోతుల సత్యనారాయణ, తోళ్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

● **ఖమ్మంలీగల్:** జ్యోతిబాపూలే జయంతిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన బార్ అసోసియేషన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, న్యాయమూర్తులు కె.ఉమాదేవి, అర్చనకుమారి, డి.రాంప్రసాద్, బిందుప్రియా, కె.దీప, బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, కార్యదర్శి గద్దల్ దిలిప్ కుమార్, సీనియర్, జూనియర్, న్యాయవాదులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ బాధ్యులు

● **ఖమ్మం సహకారనగర్:** టీఎన్జీవోస్ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కొణిదెన శ్రీనివాస్‌లు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, తదితర సమక్షంలో నివాళులర్పించారు. నగరంలోని పలు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యాన నివాళులర్పించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, టీపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, వెంగళరావు పాల్గొన్నారు.



ఖమ్మం టీఎన్జీవోస్ కార్యాలయంలో..

ఘనంగా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు

● **తిరుమలాయపాలెం:** మండల కేంద్రంలో కేవీపీఎస్, సీపీఎం ఆధ్వర్యాన పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కేవీపీఎస్ డివిజన్ నాయకులు శ్రీను, మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమపొంగు రాము, దాసరి మహేందర్, నాయకులు ముత్తయ్య, వెంకటేష్, వీరన్న గాయకుడు కొమ్ము రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు



సీపీఎం జిల్లా కార్యాలయంలో..



బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో..

అంగన్‌వాడీల్లో 'పోషణ్ పక్వాడ్'



నేలకొండపల్లిలో సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: ఖమ్మంరూరల్ మండలంలోని గూడురుపాడు, నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెం, నేలకొండపల్లి అంగన్‌వాడీకేంద్రాల్లో శుక్రవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ కవిత, సూపర్‌వైజర్లు కె.నీరజ, పి.నాగమణి మాట్లాడుతూ.. గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని అప్పుడే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది జయమ్మ, బేగం, మౌనిక, ఏఎన్ఎం బి.లక్ష్మి, ఆశావర్కర్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

గాడ్సే వారసులను అడ్డుకుందాం..



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

ఖమ్మంవన్‌టౌన్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆరు నెలల్లోనే గాంధీజీపై గాడ్సే తూటా పేల్చి హత్య చేశాడని, గాడ్సే ఆలోచనా ధోరణిని అవలంభిస్తున్న ఆయన వారసులను అడ్డుకుందామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ అప్రజాస్వామిక పాలనను సాగిస్తున్న బీజేపీ విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రం బాలగంగాధర తిలక్ అధ్యక్షతన నగరంలోని కాల్వొడ్డు సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆలోచనను కాపాడుకుంటూ జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ నినాదాలతో ప్రజలు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ పునుకొల్లు నీరజ, నగరపాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ, మిక్కిలినేని నరేందర్, కొప్పెర ఉపేందర్, కన్నం ప్రసన్నక్రిష్ణ, ముస్తఫా, రషీద్, బాణాల లక్ష్మణ్, నరాల నరేష్, బోజెడ్ల సత్యనారాయణ, అంజయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపునకు నిరసన



ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

కూసుమంచి: కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యాన నిరసన ప్రదర్శన నిర్వహించి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ మాట్లాడుతూ.. కేంద్రం కార్పొరేట్‌లకు కొమ్ముకాస్తూ పేదల నడ్డి విరుస్తుందన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, లేకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజు, నాయకులు మల్లెల హన్మంతరావు, గురుమూర్తి, రమణారెడ్డి, గంగాధర్, గన్యానాయక్, వెంకటేశ్వరరావు, కర్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

● నేడు సెడార్ వ్యాలీ ప్రథమ వార్షికోత్సవం

రఘునాథపాలెం: కొత్త కలెక్టరేట్ ఎదుట ఉన్న సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను నేడు(శనివారం) పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డి, సీనియర్ సైంటిస్టు పీకే సుందరమూర్తి(ఇస్రో), డీఈఓ సోమశేఖరశర్మ హాజరవుతారన్నారు.

● నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంరూరల్/ ఖమ్మంవ్యవసాయం/ ఖమ్మం అర్బన్: ఖమ్మంరూరల్ మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్ 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో 11కేవీ తల్లంపాడు ఇండస్ట్రియల్, 11కేవీ మద్దులపల్లి లైటింగ్ ఫీడర్లలో మెయింటెనెన్స్ కారణంగా శనివారం విద్యుత్ సరఫరా బంద్ ఉంటుందని ఏఈ ప్రభాకర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు మద్దులపల్లి, తెల్దారుపల్లి, తల్లంపాడు, పొన్నెకల్ పంచాయతీల పరిధిలో, ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు. అలాగే నగరంలోని రాపర్తినగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏఈ రవికుమార్ తెలిపారు. దీంతో రాపర్తినగర్, బీసీ కాలనీ, ఎంవీనగర్, టీఎన్జీవోస్ కాలనీ, వివేకానంద కాలనీ, పెట్రోల్ బంక్ వెనక ప్రాంతం, రమణగుట్ట, దొరన్న కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అదేవిధంగా ఖమ్మం అర్బన్ ఖానాపురం హవేలి సబ్ స్టేషన్ నుంచి మమత రోడ్ సబ్ స్టేషన్‌కు కొత్తలైన్ వేస్తున్నందున నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఖానాపురం ఏఈ నాగేశ్వరరావు తెలిపారు. దీంతో రోటరీనగర్, వైరా రోడ్డు, ఇందిరానగర్, శ్రీనగర్ కాలనీ, గోపాలపురం, గొల్లగూడెం ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

● నిత్యావసరాల పంపిణీ

ఖమ్మం మామిళ్లగూడెం: నాయీ బ్రాహ్మణ సంఘ నగర అధ్యక్షుడు యలమందల జగదీష్ పుట్టినరోజు వేడుకలను సంఘ సభ్యులు, ఇతరులు శుక్రవారం ఖమ్మంలో నిరుపేదలకు 25 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయీ బ్రాహ్మణ సంఘ కుల పెద్దలు, ప్రెస్‌క్లబ్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించొద్దు

ఖమ్మం మామిళ్లగూడెం: హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించాలనే ఆలోచనను విరమించుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి చల్లగుండ్ల శివమణి, ఐద్వా నాయకులు మాచర్ల భారతి, లత, పీవైఎల్ జిల్లా కార్యదర్శి రాకేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం అదనపు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో పాటు ఆర్డీఓకి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించడం సరికాదన్నారు. ఆవుల మంగతాయి, పోటు కళావతి, బండి పద్మ, గోకినపల్లి లలిత, మెరుగు రమణ, ప్రతాపనేని శోభ, తుడుం ఝాన్సీ, బేగం, తాటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ ఆధ్వర్యాన ర్యాలీ

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెం, ముజ్జుగూడెం, అనాసాగారం, సదాశివాపురం గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన జై బాపు- జై భీమ్-జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు, నాయకులు రమేష్, భద్రయ్య, కొడాలి గోవిందరావు, గుండా బ్రహ్మం, కడియాల నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి స్ఫూర్తితో ముందుకు సాగుదాం



జార్జిరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: అట్టడుగు వర్గాలు, మహిళలకు విద్య కోసం ఆధిపత్య వర్గాలను ఎదిరించిన జార్జ్‌రెడ్డి స్ఫూర్తితో నేటి విద్యార్థులు ముందుకు సాగాలని పీడీఎస్‌యూ నాయకుడు నామాల ఆజాద్ పిలుపునిచ్చారు. జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు టి.లక్ష్మణ్ అధ్యక్షతన ఖమ్మంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వ విధానాలతో విద్యావ్యవస్థకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని తెలిపారు. ఈమేరకు విద్యార్థులు విద్యావ్యతిరేక విధానాలతో పోరాడాలని సూచించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్, నాయకులు సాధిక్, సందీప్, అలేఖ్య, స్పందన, శైలజ, అఖిల తదితరులు పాల్గొన్నారు.

కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న గోకినపల్లి మస్తాన్

తిరుమలాయపాలెం: ప్రైవేట్, కార్పొరేట్ విద్యతో పాటు విద్యలో కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధం కావాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పాఠ్యాంశాల్లో జార్జిరెడ్డి చరిత్రను అమలు చేయాలని కోరారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించని ఎడల పెద్దఎత్తున ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు భాను, వంశీ తదితరులు పాల్గొన్నారు.